కృత్రిమ ఇసుక తయారీకి మట్టిని ట్రక్కులో లోడ్ చేస్తున్న దృశ్యం

మట్టి నుంచి ఇసుకను తీస్తున్న ఫిల్టర్

యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా

- ధనార్జనే ధ్యేయంగా కృత్రిమ ఇసుక తయారీ
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు!

కంది, డిసెంబర్ 8: కంది మండంలో ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతున్నది. అక్రమార్కులు నాణ్యతలేని కృత్రిమ ఇసుకను తయారు చేసి విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. మండలంలోని బ్యాతోల్, ఆరుట్ల, ఏర్థనూర్, బేగంపేట్ గ్రామాల పరిధిలోని అసైన్డ్ భూముల్లో అక్రమార్కులు ఇసుక ఫిల్టర్లను ఏర్పాటు చేసి యథేచ్ఛగా ఇసుక దందా కొనసాగిస్తూ నింబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. మట్టిలోంచి తీసిన నాణ్యత లేని ఇసుకను సంగారెడ్డి, పటాన్‌చెరు, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాసులుగా పోసిన ఇసుకను రాత్రి, పగలు తేడా లేకుండా రవాణా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

నక్కవాగులో నుంచి రోడ్డు వేసి..

అక్రమార్కులకు రాజకీయ నాయకుల పలుకుబడి, సంబంధిత అధికారుల అండదండలు ఉండటంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపు ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక రవాణాకు ఇబ్బంది లేకుండా నక్కవాగులో నుంచి మట్టిరోడ్డును వేసి తరలిస్తున్నారు. మూడు పువ్వులు, ఆరు కాయలుగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అప్పుడప్పుడూ అధికారులు నామమాత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం. అక్రమార్కుల ఇసుక ఫిల్టర్లను కూల్చి సీజ్ చేసినా, మరుసటి రోజే వారి వ్యాపారం తిరిగి ప్రారంభమవుతుందని స్థానికులు చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా మండల రెవెన్యూ అధికారులు స్పందించి కృత్రిమ ఇసుక దందాపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మల్లన్న జాతరకు హరీశ్‌రావుకు ఆహ్వానం

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్, డిసెంబర్ 8: మండల పరిధిలోని అనంతసాగర్‌లో ఈనెల 15న నిర్వహించనున్న మల్లన్న కల్యాణానికి రావాలని మాజీ మంత్రి హరీశ్‌రావును ఆహ్వానించారు. ఆదివారం గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి హైదరాబాద్‌లో హరీశ్‌రావును కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈమేరకు హరీశ్‌రావు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. హరీశ్‌రావును కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ సర్పంచ్‌లు రాజు, కుమ్మరి సిద్దు, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు నర్సింహులు, నాగిరెడ్డి, సురేశ్, రాములు, భూపాల్‌గౌడ్, రిషి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఈవో, తదితరులు

కోహీర్, డిసెంబర్ 8: వరంగల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఇన్‌స్పైర్ సైన్స్ అవార్డు గెలుపొందడంపై కవేలి పాఠశాల విద్యార్థి మహమ్మద్ ముస్తఫా, ఉపాధ్యాయురాలు హాజరాబేగంను ఆదివారం కవేలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ నుంచి ఉర్దూ మీడియం విద్యార్థి రూపొందించిన 'స్టాల్ ఢిల్లీ' ప్రదర్శనకు నమోదు కావడం గర్వకారణమని ఎంఈవో జాకీర్‌హుస్సేన్, హెచ్ఎం ఎలిజబెత్‌రాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నీరాజనం' ఖండ కావ్యం ఆవిష్కరణ

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రచయితలు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 8: సాహిత్య రంజనీ, సాహితీ సాంస్కృత కళా సంస్థ ఆధ్వర్యంలో తెలుగు పాఠ్యపుస్తకల రచయిత, విశ్రాంత భాషోపాధ్యాయుడు మహమ్మద్ షరీఫ్ రచించిన 'నీరాజనం' ఖండ కావ్యం ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాలలో జరిగిన కార్యక్రమంలో నిర్వహించిన కార్యక్రమానికి రచయితలు హాజరయ్యారు. సాహిత్య రంజనీ అధ్యక్షుడు పల్లె పెంటారెడ్డి, కళాశాల చైర్మన్ సలీమాన్‌రెడ్డి, శతావధాని మలుగ అంజయ్య, డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి, కవి దొరవేటి, ఎడ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాద్రి మల్లికార్జున జాతర ప్రారంభం

కోహీర్, డిసెంబర్ 8: మండలంలోని మద్రి గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత కాషాయ జెండాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మైసమ్మ, పోచమ్మ, దుర్గమ్మ, తదితర గ్రామ దేవతల గుళ్లపై జెండాలు ఆవిష్కరించారు. అనంతరం అందంగా అలంకరించిన ఎడ్ల బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

ఘనంగా దత్తాత్రేయ క్షేత్ర ఉత్సవాలు

దత్తాచల క్షేత్రం వద్ద గురు పారాయణం చేస్తున్న భక్తులు

హత్నూర, డిసెంబర్ 8: మండల కేంద్రమైన హత్నూర-మాధుర శివారులోని దత్తాచలక్షేత్ర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం క్షేత్రం వద్ద వేద పండితుల మంత్రోచ్చణలు గురుపారాయణం, మండప పూజ, పలు రకాల హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

యాసంగికి 'నల్ల వాగు' నీటి విడుదల

సిర్గాపూర్/మనూరు, డిసెంబర్ 8: సిర్గాపూర్ మండల పరిధిలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు కింద యాసంగికి కుడి, ఎడమ కాల్వలతోపాటు ఎమర్జెన్సీ కాల్వ కింద నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించనున్నట్లు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లవాగు ప్రాజెక్టు నుంచి నీటిని వదిలారు. అంతకుముందు సిర్గాపూర్ మండల పరిధిలోని 41 మంది, మనూరు మండల పరిధిలోని 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. నల్లవాగులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ యాసంగికి విడుదల చేసిన నీటిని వృథా చేయొద్దని కోరారు. వంద శాతం రాయితీతో ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ పవన్‌కుమార్, నాయకులు యాదవరెడ్డి, గుండు నరేందర్, గుండు మోహన్, బండారి సాయిలు, శ్యామ్, జితేందర్‌రెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, మల్దొడ్డి తుకారాం, మోహన్‌రెడ్డి, దేవదాస్, కురుమ హన్మాండ్లు, ఆర్ఐ శంకర్‌రెడ్డి, గంపలి సిద్ధారెడ్డి, దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, దత్తు, అమృత్, సంగన్న పాల్గొన్నారు.

నల్లవాగు ప్రాజెక్టు నీటిని వదులుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

గ్రంథాలయ సమస్యల పరిష్కారానికి కృషి

జహీరాబాద్, డిసెంబర్ 8: గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం జహీరాబాద్ పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. పాఠకులతో కాసేపు మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి గ్రంథాలయాల్లో సకల సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. యువతీయువకులు గ్రంథాలయాల్లో లభించే పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య

దత్తగిరి ఆశ్రమంలో శిఖర పూజ

ఝరాసంగం, డిసెంబర్ 8: మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఈ నెల 15న నిర్వహించే దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఆలయంలో శిఖర పూజ నిర్వహించారు. మహిళా భక్తులు హనుమాన్ మందిరం నుంచి నిండు కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని శిఖరాలకు అభిషేకం, పూజలు నిర్వహించారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ పూలమాల శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే చండి, దత్త యజ్ఞానాకి ఏర్పాట్లు చేస్తున్నారు. దత్త జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆశ్రమ పీఠధిపతులు కోరారు.

సీఐకి మాసపత్రికను అందజేస్తున్న సిద్ధేశ్వరానందగిరి మహారాజ్

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

కోహీర్, డిసెంబర్ 8: మండలంలోని కవేలి గిరిజా సమేత మహాలింగ సంగమేశ్వరాలయ వార్షికోత్సవం ఘనంగా ముగిసింది. ఆదివారం వేడుకలను పురస్కరించుకొని ఆలయంలోని శివలింగానికి అభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ వార్షికోత్సవాలకు వచ్చిన భక్తులకు మూడు రోజుల పాటు అన్నదానం చేసిన మధుకర్‌రెడ్డి కుటుంబసభ్యులను ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు రాములు, సభ్యులు అభినందించారు. ఉత్సవాలను దిగ్విజయం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఎల్ ఐజీలో అయ్యప్పస్వామి పడిపూజ

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, డిసెంబర్ 8: భారతీ నగర్ డివిజన్‌లోని ఎల్ఐజీకి చెందిన అనంతరావు గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా జరిగింది. అయ్యప్ప మాలధరణ స్వాములు అధిక సంఖ్యలో పడిపూజలో పాల్గొని స్వామి వారి కీర్తనలు, భజనలు చేశారు. పడిపూజకు బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ నాయకుడు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో అన్నీ సమస్యలే..

'గురుకుల బాట' ముగింపులో బీఆర్ఎస్‌వీ నాయకులు

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ నాయక్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 8: సమస్యలకు నిలయాలుగా గురుకులాలు దర్శనమిస్తున్నాయి. ఏ గురుకులం చూసినా సమస్యలు రాజ్యమేలుతున్నాయని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌వీ గురుకుల బాట ముగింపు సమావేశాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్‌వీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా తాము సందర్శించిన గురుకుల పాఠశాలల సమస్యల నివేదికను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పార్టీ అధ్యక్షుడు కేటీఆర్, జిల్లా ఇన్‌చార్జి పడాల సతీశ్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. కక్ష సాదింపులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ స్థాపించిన గురుకులాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

నాణ్యమైన భోజనం పెట్టడం లేదు

గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. కుళ్లిన కూరగాయలతో వంట చేసి పెడుతున్నారన్నారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు దవాఖానల పాలవుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆరోపించారు. ఇటీవల గురుకులాల్లో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు శ్రీహరి, కమ్మెట చెన్నారెడ్డి, రాజేశ్, అంజాగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కారు పైనుంచి వెళ్లడంతో గొర్ల కాపరి మృతి

అందోల్, డిసెంబర్ 8: రోడ్డు పక్కన నిద్రిస్తున్న గొర్ల కాపరి పైనుంచి కారు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జోగిపేట ఎస్సై పాండు ఆదివారం వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా ఘన్‌పూర్ మండలం రామతీర్థానికి చెందిన నాగరాజు గొర్లను మేపుతూ శనివారం రాత్రి మండల పరిధిలోని కిచ్చన్నపల్లి - కుసంగి రోడ్డు పక్కన మందను నిలిపి అక్కడే నిద్రపోయాడు. రాత్రి సమయంలో రాంసాన్‌పల్లికి చెందిన శ్రీకాంత్ నిర్లక్ష్యంగా కారు నడిపి అతడిపై నుంచి తీసుకువెళ్లడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రీడాకారులకు ఆహ్వానం

బొల్లారం, డిసెంబర్ 8: సీఎం కప్ క్రీడల్లో బొల్లారం మున్సిపల్ క్రీడాకారులు ముందుండాలని కమిషనర్ మంగతాయారు సూచించారు. ఆసక్తి గల క్రీడాకారులు http://cmcup2024.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలో 10 నుంచి 12వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా పోటీలు ఉంటాయని వివరించారు. వివరాలకు ఉన్నత పాఠశాల హెచ్ఎం మంగీలాల్, పీఈటీ రమేశ్ 94400 01674, 98488 76828 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు చెక్కుల పంపిణీ

జహీరాబాద్, డిసెంబర్ 8: నియోజకవర్గ పరిధిలో 991 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్టు జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్‌లోని ఎస్వీ ఫంక్షన్ హాలులో జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్‌కు చెందిన 117 మందికి, జహీరాబాద్‌కు చెందిన 445 మందికి, మొగుడంపల్లిలో 134 మందికి, కోహీర్‌కు చెందిన 165 మందికి, ఝరాసంగానికి చెందిన 130 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమానికి ఆయా మండలాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు విధిగా హాజరుకావాలని సూచించారు.

దివ్యాంగులకు పండ్లు పంపిణీ

పటాన్‌చెరు, డిసెంబర్ 8: పోషకాహార క్షీణతతో బాధపడుతున్న దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం సభ్యులైన కండర క్షీణత వ్యాధి బాధితులు 20 మందికి సాయిరాం పండ్ల కిట్ అందజేశారు. దివ్యాంగులైన తమ గ్రూప్ సభ్యుల గురించి తెలుసుకొని ముత్తంగి గ్రామానికి చెందిన సాయికుమార్ పండ్లు పంపిణీ చేశారని కండర క్షీణత వ్యాధి బాధిత సంఘం రాష్ట్ర కార్యదర్శి మడపతి రవికుమార్ తెలిపాడు. దివ్యాంగులకు పోషకాహారం అందట్లేదని తెలుసుకొని పండ్లు ఇవ్వడంపై సాయిరాంను అభినందించారు. కార్యక్రమంలో బాపు వెంకన్న, కంచిగారి మహేశ్ కుమార్, కంజర్ల జ్యోతి, సాయిలు, మణిరత్నం, బుజ్జి, మహేశ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మూడు కిలోల ఎండు గంజాయి పట్టివేత

కంగ్టి, డిసెంబర్ 8: వాహనాల తనిఖీలో భాగంగా ఆదివారం కంగ్టి మండలం దెగుల్‌వాడీ గ్రామ సమీపంలో బైక్ ప్రయాణికుల నుంచి మూడు కిలోల ఎండుగంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు కర్ణాటకలోని ఔరద్ ప్రాంతం నుంచి దెగుల్‌వాడీ వైపు వస్తున్న బైక్‌ను తనిఖీ చేయగా వారి నుంచి మూడు కిలోల ఎండుగంజాయిని పట్టుకొని, బైక్‌పై ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

అనాథలా ఆశ్రమానికి..

- జహీరాబాద్ ఏరియా దవాఖానలో ఏడాదిగా చెట్టుకిందే వృద్ధురాలి సావాసం
- కుటుంబ సభ్యులు వదిలివెళ్లడంతో భిక్షాటన
- దవాఖాన అధికారులు, పోలీసుల చొరవతో అనాథ ఆశ్రమానికి తరలింపు

వృద్ధురాలిని అనాథ ఆశ్రమానికి తరలించిన జహీరాబాద్ పోలీసులు

జహీరాబాద్, డిసెంబర్ 8: అయినవారు వద్దనుకున్నారు. వృద్ధురాలు అని చూడకుండా ఆస్తి మొత్తాన్ని లాగేసుకొని వదిలివేశారు. ఎక్కడున్నానో, ఏం చేయాలో, ఎలా బతకాలో తెలియక ఆ పండుటాకు ఓ చెట్టు కింద ఏడాదిగా భిక్షాటన చేసుకుంటూ బతుకున్నది. గుర్తించిన అధికారుల సూచనతో పోలీసులు ఆమెను అమ్మానాన్న అనాథ ఆశ్రమానికి తరలించారు. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ కథనం ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని ఏరియా దవాఖాన ఆవరణలోని చెట్టు కింద సంవత్సరం నుంచి ఓ వృద్ధురాలు భిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తుంది. దవాఖాన సూపరింటెండెంట్ వృద్ధురాలి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు అప్పగించాలని పోలీసులను కోరారు. పోలీసులు స్పందించి వృద్ధురాలి వివరాల కోసం ఆరా తీశారు. ఆమె మరాఠా భాషలో మాట్లాడుతుండడంతో వివరాలు ఆరా తీసి మహారాష్ట్రలోని పండరీపూర్ ప్రాంతానికి చెందినదిగా గుర్తించారు. వృద్ధురాలి పేరు మంజూతాయి అని, కుటుంబ సభ్యులు ఆమె పేరిట ఉన్న ఆస్తి మొత్తాన్ని తీసుకొని జహీరాబాద్ ప్రాంతంలో సంవత్సరం క్రితం వదిలిపెట్టి వెళ్లినట్టు తెలిపింది. వృద్ధురాలు కుటుంబ సభ్యుల వివరాలు తెలిపేందుకు నిరాకరించడంతో పోలీసులు ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌లోని అమ్మానాన్న అనాథ ఆశ్రమానికి తరలించారు. వృద్ధురాలిని అనాథ ఆశ్రమానికి తరలించినందుకు దవాఖాన అధికారులు, జహీరాబాద్ పట్టణ పోలీసులను పలువురు అభినందించారు.

వీరశైవ లింగాయత్ మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న పృథ్వీరాజ్

మునిపల్లి, డిసెంబర్ 8: వీరశైవ లింగాయత్ మునిపల్లి మండల కమిటీని ఆదివారం మండలంలోని బుధేరా చౌరస్తాలోని ఓ ఆశ్రమంలో ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వీరశైవ లింగాయత్ నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా న్యాలకంటి వీరన్న, అధ్యక్షుడిగా పట్లోళ్ల వీరన్న, ప్రధాన కార్యదర్శిగా నీలం మల్లేశం, కోశాధికారి తిర్లపురం మల్లన్న, ఉపాధ్యక్షులుగా కోహీర్ సతీశ్, నవీన్, సెక్రటరీగా వంశీ గురువ, సలహాదారులుగా పట్లోల శేఖర్, పోలీస్ మల్లన్న, సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను జిల్లా అధ్యక్షుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ధనుంజయ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఆనంద్ కృష్ణారెడ్డికి రాష్ట్రస్థాయి అవార్డు

బొల్లారం డిసెంబర్ 8: వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులను గుర్తించి విశ్వ గురు వరల్డ్ రికార్డ్ ఆధ్వర్యంలో కామధేను 2024 అవార్డ్స్‌ను ప్రదానం చేశారు. బొల్లారానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి సామాజిక సేవలకుగాను కామధేను 2024 రాష్ట్రస్థాయి అవార్డు అందించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందా, సంస్థ ప్రతినిధులు సత్యవోలు రాంబాబు, డాక్టర్ ప్రొఫెసర్ సారంగపాణి చేతుల మీదుగా అవార్డు అందించి సన్మానించారు. అవార్డు అందుకోవడంపై ఆనంద్ కృష్ణారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తన సేవలను గుర్తించిన సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి

జోగిపేటలో పశువుల సంత ప్రారంభం

సంతను ప్రారంభించి రైతులతో మాట్లాడుతున్న ఏఎంసీ, మున్సిపల్ చైర్మన్లు, నాయకులు

అందోల్, డిసెంబర్ 8: అందోల్-జోగిపేట పరిసర ప్రాంత గ్రామాల రైతుల సౌకర్యార్థం జోగిపేట మార్కెట్ యార్డులో ప్రతీ ఆదివారం పశువులు, మేకల సంతను నిర్వహిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మల్లయ్యతో కలిసి సంతను ప్రారంభించి రైతులతో మాట్లాడారు. సంతలో రైతులకు కావాల్సిన అన్ని వసతులు కల్పించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ కార్యదర్శి సునీల్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్, డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.